నోళ్లకు కళ్లెం వేయండి

బంజారాహిల్స్ తాజ్ కృష్ణా హోటల్‌లో వివిధ పార్టీల నేతలతో సమావేశమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎలక్షన్ కమిషనర్లు, అనిల్‌గోయల్, అనూప్‌చంద్రపాండే

మొదటిపేజీ తరువాయి...

ఉన్నతాధికారుల బృందం మంగళవారం హైదరాబాద్ వచ్చింది. హోటల్ తాజ్ కృష్ణాలో ఆ బృందం జాతీయ, ప్రాంతీయ పార్టీల ప్రతినిధులతో విడివిడిగా భేటీ అయ్యింది. బీఆర్ఎస్ తరపున బీ వినోద్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శులు ఎం శ్రీనివాస్‌రెడ్డి, సోమ భరత్‌కుమార్ గుప్తా హాజరయ్యారు. ఎంఐఎం, ఆప్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, ఇతర పార్టీల ప్రతినిధులు కూడా ఎన్నికల అధికారులను కలుసుకున్నారు.

రోడ్ రోలర్‌ను తొలగించాల్సిందే

ఎన్నికల అధికారులతో భేటీ అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు కారు గుర్తును కేటాయించిన 2004 నుంచి 2019వరకు జరిగిన వివిధ ఎన్నికలలో కారు గుర్తుకు వచ్చిన ఓట్లు, కారును పోలి ఉన్న గుర్తులకు వచ్చిన ఓట్ల వివరాలను అధికారులకు వివరించామని తెలిపారు. తమ పార్టీ విజ్ఞప్తి మేరకు గతంలో ఆటో, ట్రక్కు గుర్తులను, 2011లో రోడ్ రోలర్ గుర్తును తొలగించారని తెలిపారు. కారును పోలిన అన్ని గుర్తులను జాబితా నుంచి తొలగించాలని కోరామని చెప్పారు. యుగ తులసి పార్టీకి కేటాయించిన రోడ్ రోలర్ గుర్తును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. జాతీయ, ప్రాంతీయ పార్టీలకు ప్రత్యేకంగా ఈవీఎంలను ఏర్పాటుచేయాలని కోరామని, దీని ద్వారా జాతీయ, పార్టీల గుర్తులను పోలిన గుర్తులతో సమస్యలు రావని అన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు

ఎన్నికల సమయంలో కొందరు నాయకులు.. జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలపై సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్ చానెల్స్‌లో అసభ్యంగా, దూషిస్తూ మాట్లాడుతున్నారని, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇటువంటి వారిని అదుపు చేయాలని సీఈసీని కోరినట్టు వినోద్‌కుమార్ చెప్పారు. తమ రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా చూస్తున్నారని ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రముఖుల కుటుంబ సభ్యులపైనా వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకునే విధంగా ఎన్నికల సంఘం స్పందించాలని కోరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు. రాష్ట్రంలో కొందరు మత చాంధసవాదులు పరిధి దాటి మాట్లాడుతున్నారని, ఇది శాంతి భద్రతల సమస్యలకు దారి తీస్తున్నదని, సున్నితమైన అంశాలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారని వీరిపై ఓ కన్నేసి ఉంచాలని కోరామని తెలిపారు.

అభ్యర్థి ఖర్చు పెంచాలి

ఎన్నికల్లో ప్రచార సామగ్రి ధరలు అన్ని జిల్లాల్లో ఒకే విధంగా ఉండేలా చూడాలని కోరామని వినోద్‌కుమార్ తెలిపారు. పెట్రోల్, డీజిల్, ఇతర వస్తువులు, సామగ్రి ధరలు పెరిగినందున అభ్యర్థుల ఎన్నికల ఖర్చును మరో రూ.20 లక్షలు పెంచాలని కోరామని చెప్పారు. పార్టీ కార్యకర్తలు నాయకులు ఉపయోగించే జెండాలు, టోపీలు, టీ షర్ట్‌ల ఖర్చులను ప్రతిరోజు కొత్తగా కొనుగోలు చేసినట్టు వాటిని ఖర్చు పరిధిలోకి తీసుకొస్తున్నారని, దీనిపై అభ్యంతరం తెలిపామని చెప్పారు.

స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలి

కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించే మార్గదర్శకాల పుస్తకాలను హిందీ, ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, ఇతర ప్రాంతీయ భాషల్లోనూ అందుబాటులో ఉంచాలని వినోద్‌కుమార్ సూచించారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా జరిగేలా చూడాలని, ఇందుకు తమ పార్టీ పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో సీఈసీ భేటీ

హైదరాబాద్, అక్టోబరు 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయడానికి ముందు కేంద్ర ఎలక్షన్ కమిషన్ రాష్ట్రంలో పర్యటిస్తున్నది. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణాలో బస చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ఎన్నికల అధికారులు మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో భేటీ అయ్యారు. బుధవారం వారు జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో భేటీ కానున్నారు.

కేబుల్ బ్రిడ్జిపై వాకథాన్

ఎన్నికలపై ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా బుధవారం దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై వాకథాన్, సైక్లింగ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను ఉదయం 6.30 గంటలకు సీఈసీ రాజీవ్‌కుమార్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్ సైక్లింగ్ రెవల్యూషన్ సంస్థ సహకారంతో చేపట్టనున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

కేంద్ర ఎన్నికల సంఘం.. రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాలపై డీజీపీ అంజనీకుమార్ ద్వారా సమాచారం తీసుకున్నట్టు తెలిసింది. ఈసారి కూడా సరిహద్దు రాష్ట్రాల నుంచి కొంత అదనపు సిబ్బందిని రంగంలోకి దించే ఆలోచన ఉన్నట్టు సమాచారం. ఎన్నికల సందర్భంగా దొరికే మద్యం, డబ్బు వివరాలను వెంటనే కేంద్ర ఎన్నికల సంఘానికి తెలిపేలా ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను తెలంగాణలో వినియోగిస్తారని తెలిసింది. ఎన్నికలకు అతి త్వరలో షెడ్యూల్ జారీ కానున్న నేపథ్యంలో ట్రై కమిషనరేట్లు, అన్ని జిల్లాలవ్యాప్తంగా ఉన్న లైసెన్స్‌డ్ ఆయుధాలను పోలీసులకు, అధీకృత సంస్థలకు తిరిగి ఇచ్చేలా ఆదేశాలు జారీకానున్నాయి. ఆయుధాల లైసెన్సులు కలిగిన వారిలో జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ భద్రతా సిబ్బందిని, క్రీడాకారులను మినహాయించనున్నారు.

భారీగా పెరిగిన యూరియా వినియోగం

నిరుటి కంటే 1.29 లక్షల టన్నులు అధికం

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈసారి వ్యవసాయానికి యూరియా వినియోగం భారీగా పెరిగింది. నిరుటితో పోల్చితే ఈ ఏడాది వానకాల సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ రైతులు 1.29 లక్షల టన్నులు అధికంగా యూరియాను వినియోగించారు. నిరుడు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం 9.05 లక్షల టన్నుల యూరియాను వినియోగించగా.. ఈ ఏడాది అది 10.34 లక్షల టన్నులకు పెరిగింది. 2020-21 తర్వాత ఇదే అత్యధిక వినియోగం. 2020-21లో ఏకంగా 10.48 లక్షల టన్నుల యూరియాను వినియోగించడం గమనార్హం.

గత రెండు నెలల్లో రికార్డు స్థాయి కొనుగోళ్లు

ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రైతులు రికార్డు స్థాయిలో యూరియాను కొనుగోలు చేశారు. ఆగస్టులో వర్షాలు లేక పోయినప్పటికీ అత్యధికంగా 3.42 లక్షల టన్నుల యూరియా విక్రయం జరిగింది. అప్పటి వరకు 2020-21 ఆగస్టులో విక్రయించిన 3.03 లక్షల టన్నులే అత్యధికం. ఈసారి సెప్టెంబర్‌లోనూ భారీగా యూరియా విక్రయం జరిగింది. నిరుడు సెప్టెంబర్‌లో 2.63 లక్షల టన్నులుగా ఉన్న యూరియా విక్రయం గత నెలలో ఏకంగా 3.44 లక్షల టన్నులకు పెరిగింది.

వాతావరణ మార్పులే కారణం

ప్రస్తుత సీజన్‌లో పంటల సాగు తగ్గినప్పటికీ వాతావరణ మార్పుల వల్ల యూరియా వినియోగం పెరగినట్టు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పున్నారు. నిరుడు ఇదే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 1.32 కోట్ల ఎకరాల్లో వివిధ పంటలు సాగవగా.. ఈసారి 1.26 కోట్ల ఎకరాలకే పరిమితమైంది. కానీ, వరి సాగు మాత్రం 64.46 లక్షల ఎకరాల నుంచి 65 లక్షల ఎకరాలకు పెరిగింది. ప్రస్తుత సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు రైతులను ఇబ్బంది పెట్టాయి. దీంతో వర్షాలు పడినప్పుడల్లా రైతులు యూరియాను చల్లారని, అందుకే యూరియా వినియోగం భారీగా పెరిగిందని అధికారులు వివరించారు.

వానకాలం సీజన్‌లో యూరియా వినియోగం (లక్షల టన్నుల్లో)

సంవత్సరం	ఆగస్టు	సెప్టెంబర్	మొత్తం
2018-19	2.10	2.47	7.84
2019-20	2.57	2.47	7.56
2020-21	3.03	1.79	10.48
2021-22	2.83	1.97	9.50
2022-23	2.75	2.63	9.05
2023-24	3.42	3.44	10.34

6 నుంచి ముఖ్యమంత్రి 'అల్పాహారం'

రంగారెడ్డి జిల్లాలో ప్రారంభంచనున్న కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): ఈ నెల 6 నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని, రంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నెల 14 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 85 లక్షల బతుకమ్మ చీరల పంపిణీని పూర్తి చేయాలని చెప్పారు. రాష్ట్రంలో యువతకు 18 వేల స్పోర్ట్స్ కిట్ల పంపిణీని వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హెచ్చార్సీ నియామకంపై మీ నిర్ణయమేమిటి?

16లోగా తెలపాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకానికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నదీ ఈ నెల 16లోగా తెలియజేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ విషయంలో సీఎం, ప్రతిపక్ష నేత ఇతరులతో కూడిన కమిటీ తీసుకున్న నిర్ణయాలను తెలపాలని కోరింది. హక్కుల కమిషన్‌కు చైర్మన్‌ను, సభ్యులను నియమించడంలేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది హరేందర్ పరిషద్ మాట్లాడుతూ.. చైర్మన్ పోస్టుకు 4, జ్యుడీషియల్ సభ్యుల పోస్టుకు 10, నాన్ జ్యుడీషియల్ సభ్యుల పోస్టుకు 64 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. వారిలో అర్హులైన వారిపై ఎంపిక కమిటీ నిర్ణయం తీసుకోనుందని తెలిపారు. ఆ వివరాలు తెలిపేందుకు వారం గడువు కావాలని కోరారు.

విద్యుత్తు బకాయిలపై తీర్పు వాయిదా

కేంద్రం ఏపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నది
హైకోర్టులో తెలంగాణ వాదన

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య విద్యుత్తు బకాయిల వివాదంలో కేంద్రం జోక్యంపై హైకోర్టు తీర్పు వాయిదా పడింది. ఇరుపక్షాల సుదీర్ఘ వాదనల తర్వాత తీర్పును రిజర్వులో పెడుతున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం ప్రకటించింది. ఏపీ బకాయిలు రూ.3,441.78 కోట్ల అసలు, చెల్లింపుల్లో జాప్యం చేసినందుకు సర్‌చార్జి రూ.3,315 14 కోట్లతో కలిపి మొత్తం రూ. 6,756.92 కోట్లను 30 రోజుల్లో చెల్లించాంటూ గత ఆగస్టు 20న కేంద్రం జారీచేసిన ఉత్తర్వులను తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర విద్యుత్తు సంస్థలు హైకోర్టులో సవాల్ చేశాయి. కేంద్ర ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ హైకోర్టు ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం తుది విచారణ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, అదనపు అడ్వొకేట్ జనరల్ జే రామచందర్‌రావు, విద్యుత్తు సంస్థల తరపున వై రామారావు వాదనలు వినిపించారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం ఈ వివాదంలో జోక్యం చేసుకొనే అధికారం కేంద్రానికి లేదని రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థల తరపున వాదనలు వినిపించిన సీఎస్ వైద్యనాథన్, జే రామచంద్రరావు చెప్పారు. వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వులో పెట్టింది.

మారుతి కారును 'రోల్స్ రాయిస్'గా మార్చేశాడు!

లగ్జరీ కార్లలో 'రోల్స్ రాయిస్' ప్రత్యేకత వేరు. కేరళకు చెందిన యువకుడు హబీఫ్ కేవలం రూ.45 వేలతో రోల్స్ రాయిస్ తరహా కారును తయారుచేశాడు. న్యూబాడీ కిట్‌ను ఉపయోగించి మారుతి 800 కారును రోల్స్ రాయిస్‌గా తీర్చిదిద్దాడు. యూజ్డ్ కార్లలోని మెటల్ షీట్లను, ఇతర పరికరాల్ని వాడినట్టు హబీఫ్ తెలిపాడు. కొత్తగా అవిష్కరించిన కారుపై అద్దాలు, చక్రాలు, హెడ్‌లైట్స్ వివిధ భాగాలను లగ్జరీ కారును తలపించేలా అవిష్కరించాడు. హబీఫ్ గతంలో మోటార్ సైకిల్ ఇంజిన్‌ను ఉపయోగించి జీప్‌ను తయారుచేశాడు. - తిరువనంతపురం

తిరుమలలో 15 నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): తిరుమలలో నిర్వహించనున్న శ్రీనివాసుడి నవరాత్రి బ్రహ్మోత్సవాల షెడ్యూల్‌ను టీటీడీ వెల్లడించింది. ఈనెల 15 నుంచి 23 వరకు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాల ఆరంభం నుంచి ముగింపు రోజు వరకు అష్టాదశ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేశారు. ఆర్జిత బ్రహ్మోత్సవ సేవ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులను నిర్దేశిత వాహన సేవకు అనుమతిస్తారు. 15న రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పెద్ద శేష వాహనంపై శ్రీవారి ఊరేగింపుతో నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 23న శ్రీవారి చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయని టీటీడీ అధికారులు తెలిపారు.

వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటుచేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్న టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మమత, సత్యనారాయణ తదితరులు

రెండో వేతన సవరణ కమిషన్ ఏర్పాటుపై హర్షం

- సీఎం కేసీఆర్‌కు టీజీవో, పీఆర్టీయూ టీఎస్ కృతజ్ఞతలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వేతన సవరణకు రెండో వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయడం పట్ల టీజీవో, పీఆర్టీయూ టీఎస్ హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపాయి. మధ్యంతర భృతి (ఐఆర్) ఉత్తర్వులపై మాత్రం పునరాలోచించి 11శాతంగా నిర్ణయించాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

ఐఆర్‌పై పునరాలోచించాలి : టీజీవో

ఉద్యోగులు, పెన్షనర్లు, టీచర్లకు ప్రకటించిన 5% ఐఆర్‌పై ప్రభుత్వం పునరాలోచించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) అధ్యక్షుడు వీ మమత, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ కోరారు. ఐఆర్‌ను 5 నుంచి 10శాతానికి పెంచాలని విజ్ఞప్తిచేశారు.

పీఆర్సీ ఏర్పాటు హర్షణీయం

- ఈహెచ్ఎస్ పథకాన్ని ప్రకటించాలి
- పెండింగ్ డీఏలను మంజూరుచేయాలి
- ఐఆర్‌పై పునరాలోచించాలి
- మంత్రి హరీశ్‌రావుకు టీఎన్జీవో వినతి



ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలని కోరుతూ మంత్రి హరీశ్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల వేతన సవరణకు వీలుగా రిటైర్డ్ ఐఏఎస్ ఎన్ శివశంకర్, సభ్యుడిగా బీ రామయ్యతో కూడిన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయడం పట్ల టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్వర్ హర్షం వ్యక్తంచేశారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం (ఈహెచ్ఎస్) కల్పించాలని టీఎన్జీవో ప్రభుత్వాన్ని కోరింది. పెండింగ్ డీఏలను సైతం మంజూరుచేయాలని విజ్ఞప్తిచేసింది. ఈ మేరకు మంగళవారం టీఎన్జీవో ప్రతినిధి బృందం ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించింది. వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటుచేయడంతోపాటు, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించినందుకు ఉద్యోగుల పక్షాన టీఎన్జీవో నేతలు ధన్యవాదాలు తెలియజేశారు. అయితే 5% ఐఆర్ విషయంలో పునరాలోచించాలని కోరారు. ఐఆర్‌పై ఉద్యోగుల్లో ఆందోళన నెలకొన్నదని, దీనిని పెంచాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, సీపీఎస్‌ను రద్దుచేయాలని విజ్ఞప్తి చేయగా మంత్రి సానుకూలంగా స్పందించారని రాజేందర్, జగదీశ్వర్ తెలిపారు.

రాష్ట్రంలో మరో మూడు మండలాలు

- నిర్మల్ జిల్లాలో 2, వనపర్తి జిల్లాలో ఒకటి..
- ప్రభుత్వ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా మరో మూడు మండలాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. మంగళవారం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ మండలాల ఏర్పాటు ఉత్తర్వులు ఇచ్చారు. నిర్మల్ జిల్లాలో 15 గ్రామాలతో మాలేగావ్, 12 గ్రామాలతో బెల్తారోడా మండలాలు, వనపర్తి జిల్లాలో 8 గ్రామాలతో ఏదుల మండలాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. 15 రోజులపాటు అభ్యంతరాలకు అవకాశం కల్పించారు. ఆ తర్వాత తుది నోటిఫికేషన్‌ను జారీ చేస్తారు. వనపర్తి జిల్లాలో చిన్నారం, చీరకపల్లి, ఏదుల, సింగాయిపల్లి, తుర్కదిన్నె, మాచుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, రేకుపల్లి గ్రామాలతో కలిపి ఏదుల మండలం, నిర్మల్ జిల్లాలో సన్వాలి, వాయి, లింగి, సోనా, హంపోలి (బి), మోలా, అంతర్ని, పంగ్రా, గొడ్సెర, సొనారి, నిగ్వా, మాలేగావ్, గోదాపూర్, కుప్టి, వర్ని గ్రామాలను కలుపుతూ మాలేగావ్ మండలం, ఇదే జిల్లాలోని ఝరి (కే), వాజ్జిరి, బెల్తారోడా, భోసి, మహాలింగి, బమిని, బండోరత్, బోస్లా, ఝరి (బుజుర్గ్), ఉమ్రీ (ఖుర్ద్), బోరేగావ్ (ఖుర్ద్), బెంబెర్ గ్రామాలను కలుపుతూ బెల్తారోడా మండలంగా ప్రతిపాదించింది.

పదోన్నతుల్లేకుండా బదిలీలు

- రెండు జోన్లలో టీచర్ల ట్రాన్స్‌ఫర్స్
- విద్యాశాఖ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని రెండు మల్టిజోన్లలో పదోన్నతులు చేపట్టకుండా కేవలం బదిలీలు మాత్రమే పూర్తిచేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లాలో సీనియార్టీపై, పదోన్నతులకు టెట్ అర్హత కేసులుండటం, పదోన్నతులపై స్టే ఉన్నందున ఈ నిర్ణయం తీసుకొన్నది. ఈ మేరకు మల్టిజోన్ 1, 2 పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్తు సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ), మల్టిజోన్–2 పరిధిలోని జిల్లా పరిషత్తు బడుల్లోని స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) టీచర్ల బదిలీలను చేపట్టనున్నది. మంగళ, బుధవారాల్లో అప్పీళ్లు, ర్యాంకుల దిద్దుబాటు, ఖాళీల సవరణల అప్‌డేట్‌కు అవకాశం కల్పించారు. ఈ నెల 5న తుది సీనియార్టీ జాబితాలు ప్రకటిస్తారు. 6,7న బదిలీలకు వెబ్ ఆప్షన్ల అవకాశం కల్పించారు. 8న వెబ్ ఆప్షన్లను సవరించుకోవచ్చు. వెబ్ ఆప్షన్లు ఎంచుకొన్న తర్వాత ఖాళీల పాయింట్లు, స్పౌజ్ పాయింట్లలో ఎటువంటి మార్పులుండవని అధికారులు ప్రకటించారు.

- మల్టిజోన్ –1లోని 19 జిల్లాల్లో జీహెచ్ఎం బదిలీలు, పదోన్నతులు విజయవంతంగా ముగిశాయి. స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు ప్రభుత్వ, జిల్లా పరిషత్తు బడుల్లో ముగిశాయి. షెడ్యూల్ ప్రకారం సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఎస్ఏ పదోన్నతులు కల్పించాల్సి ఉండగా, టెట్ అర్హత వివాదం నేపథ్యంలో పదోన్నతులు పక్కనబెట్టి, బదిలీలు చేపట్టనున్నారు.
- మల్టిజోన్ –2 పరిధిలోని 14 జిల్లాల్లో ఇప్పటివరకు జిల్లా పరిషత్తులో కేవలం గెజిటెడ్ హెచ్ఎంల బదిలీలు మాత్రమే పూర్తయ్యాయి. వీటితో పాటు, ప్రభుత్వ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు కూడా ముగిశాయి. తాజాగా ఈ మల్టీజోన్ పరిధిలోని జిల్లా పరిషత్ స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు.

9,270 స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు

మల్టిజోన్ –1లో స్కూల్ అసిస్టెంట్ల బదిలీల కోసం 16,498 మంది టీచర్లు దరఖాస్తు చేసుకొన్నారు. వీరిలో 15,879 మంది టీచర్లు వెబ్ ఆప్షన్లు ఎంచుకొన్నారు. వీరిలో 5,216 మంది అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. వీరిని మినహాయిస్తే 10,684 మంది బదిలీ కావాల్సి ఉండగా, సోమవారం 9,270 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. ఇక 1,414 టీచర్ల బదిలీలు నిలిచిపోయాయి. స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఉర్దూ, ఫిజికల్ డైరెక్టర్ బదిలీలకు బ్రేక్‌పడటంతో 1,414 మంది బదిలీలు నిలిచిపోయాయి. పలు సాంకేతిక కారణాలతో వీరి బదిలీలను అధికారులు నిలిపివేశారు.

13 నుంచి బడులకు దసరా సెలవులు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని రాష్ట్రంలోని బడులకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. ఈ నెల 13 నుంచి 25 వరకు 13 రోజుల పాటు ప్రభుత్వ, ప్రైవేట్ బడులకు సెలవులు ఉంటాయని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని రకాల స్కూళ్లు ఈ సెలవులను పాటించాలని సూచించింది. ఇంటర్మీడియట్ కాలేజీలు మాత్రం 19 నుంచి 25 వరకు సెలవులివ్వాలని పేర్కొన్నది.

పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టండి

ఉపాధ్యాయ సంఘాలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : టీచర్లకు పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని పలు ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. పదోన్నతులతో నిమిత్తం లేకుండా బదిలీలు చేపట్టడం ద్వారా నష్టం కలుగుతుందని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాయి. ఈ మేరకు మంగళవారం పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం చెన్నయ్య, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధానకార్యదర్శి నవాత్ సురేశ్ తదితరులున్నారు.

ఏసీబీ వలలో ముగ్గురు రెవెన్యూ అధికారులు

అంబర్‌పేట, అక్టోబర్ 3: రాష్ట్రంలో రెండు వేర్వేరు చోట్ల ఏసీబీ దాడుల్లో ముగ్గురు రెవెన్యూ అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. హైదరాబాద్ అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయ పరిధిలో తన తల్లి ప్లాటు రిజిస్ట్రేషన్ ఫైల్ తదుపరి ఉత్తర్వుల కోసం దాదుబాయి వెంకటేశ్వర్‌రావు అనే వ్యక్తి అధికారులను సంప్రదించారు. ప్లాటు రిజిస్ట్రేషన్ విలువను రూ.80 లక్షల నుంచి రూ.60 లక్షలకు తగ్గిస్తామని, అందుకు తమకు రూ.10 లక్షలు ఇవ్వాలని స్పెషల్ ఆర్ఐ శోభ, సర్వేయర్ లలిత డిమాండ్ చేశారు.బాధితుడు వెంకటేశ్వర్‌రావు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు రూ.1.50 లక్షలను ఆర్ఐ, సర్వేయర్ పంపిన ప్రైవేటు వ్యక్తి ఎం బాపుయాదవ్‌కు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనితోపాటు ఆర్ఐ శోభను ఏసీబీ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. సర్వేయర్ పరారీలో ఉన్నాడు.

మెట్‌పల్లిలో ఆర్ఐ పట్టివేత

మెట్‌పల